నాలుగో విలువైన బ్రాండ్‌గా ఎల్ఐసీ

బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా 100 నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 29: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో ఖ్యాతిని సాధించింది. దేశీయంగా ఉన్న కార్పొరేట్ బ్రాండ్లలో అత్యంత విలువైన నాలుగో సంస్థగా అవతరించింది. కంపెనీ బ్రాండ్ విలువ 9.8 బిలియన్ డాలర్లతో ఈ స్థానం దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా 100-2024 విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏఏఏ బ్రాండ్ రేటింగ్‌తో సంస్థకు 88 స్కోర్ సాధించినట్లు తెలిపింది. అలాగే టాప్-10 బలమైన దేశీయ బ్రాండ్లలో మూడో స్థానంలో నిలిచింది. బీమా బ్రాండ్ల ర్యాంకింగ్‌లో ఎల్ఐసీ తన తొలిస్థానాన్ని పదిలపరుచుకున్నది కూడా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీమా సంస్థల విలువలో 9.8 బిలియన్ డాలర్లతో ఎల్ఐసీ తొలి స్థానంలో నిలిచింది. క్యాథీ లైఫ్ ఇన్సూరెన్స్ రెండో స్థానంలో నిలువగా, ఎన్ఆర్ఎంఏ ఇన్సూరెన్స్ ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి 96.50 శాతం వాటా ఉండగా, ప్రజలకు 3.50 శాతం వాటా ఉన్నది. స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థలో ప్రజలకు కనీసంగా 10 శాతం వాటా ఉండాలనే నిబంధనలపై ఎల్ఐసీకి మరో మూడేండ్ల గడువు ఇచ్చింది. మే 16, 2027 నాటికి ఎల్ఐసీఐలో ప్రజల వాటా 10 శాతానికి పెంచుకోవాలని సూచించింది. మే 17, 2022లో స్టాక్ మార్కెట్లో లిస్టైన విషయం తెలిసిందే. 3.5 శాతానికి సమానమైన 22.13 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో కేంద్ర ప్రభుత్వం విక్రయించింది.

ఎస్బీఐ చైర్మన్‌గా పాలమూరు బిడ్డ

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బాస్‌గా సీఎస్ శెట్టి



న్యూఢిల్లీ, జూన్ 29: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) నూతన చైర్మన్‌గా తెలంగాణ వ్యక్తి నియమితులవుతున్నారు. ప్రసుత్తం ఎస్బీఐ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీఎస్ శెట్టిని ఎస్బీఐ చైర్మన్‌గా ఆర్థిక సేవల సంస్థల బ్యూరో(ఎఫ్ఎస్ఐబీ) సిఫారస్ చేసింది. ప్రస్తుతం చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న దినేశ్ కుమార్ ఖారా ఈ ఏడాది ఆగస్టు 28న పదవీ విరమణ చేయబోతున్నారు. ఆయన స్థానంలో నూతన వ్యక్తిని నియమించడానికి ఎఫ్ఎస్ఐబీ పలువురు సీనియర్ ఉన్నతాధికారులను శనివారం ఇంటర్వ్యూ చేసింది. వీరిలో శెట్టి కూడా ఒకరు. బ్యాంక్‌లో వారి పనితీరు, అనుభవం, ప్రస్తుత పరిమితులను దృష్టిలో పెట్టుకొని చల్లా శ్రీనివాసులు శెట్టిని(సీఎస్ శెట్టి) ఎస్బీఐ చైర్మన్ పదవికి సిఫారస్ చేసినట్లు ఎఫ్ఎస్ఐబీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్(ఏసీసీ) కమిటీ సమావేశమై ఎఫ్ఎస్ఐబీ సూచించిన వ్యక్తిపై తుది నిర్ణయం తీసుకోనున్నది. జనవరి 2020లో బ్యాంక్ ఎండీగా నియమితులైన శెట్టి..ప్రస్తుతం ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ వర్టికల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను శెట్టి బేసిక్ వేతనం కింద రూ.26.3 లక్షలు, డీఏ కింద మరో రూ.9.7 లక్షలు అందుకున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు ఫోర్స్/కమిటీలకు ఆయన సారథ్యం వహించారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని మానవపాడు మండలంలోని పెద్ద పోతులపాడు గ్రామంలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఆపై గద్వాల్‌లో ఉన్నత చదువులు చదివారు. రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ నుంచి బీఏ అగ్రికల్చర్‌లో పట్టా పొందారు. ఎస్బీఐలో 1988లో ప్రొబేషనరీ ఆఫీసర్ స్థాయిలో కేరియర్ ప్రారంభించిన శెట్టి..బ్యాంకింగ్ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్ అండ్ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ విధులు నిర్వహించారు.

- ఎస్బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జనరల్ మేనేజర్‌గా, జనరల్ మేనేజర్‌గా కార్పొరేట్ అకౌంట్స్ గ్రూపులో విధులు నిర్వహించారు.
- కమర్షియల్ బ్రాంచ్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా కూడా పనిచేశారు.

ఎఫ్ఎస్ఐబీలో సభ్యులు:

- డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ) మాజీ కార్యదర్శి భాను ప్రతాప్ శర్మ అధ్యక్షుడు
- సభ్యులుగా ఆర్థిఖ సేవల కార్యదర్శి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెక్రటరీ, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్
- ఇతర సభ్యులుగా ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ మాజీ చైర్మన్, ఎండీ అనిమేశ్ చౌహాన్, ఆర్బీఐ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపక్ సింఘాల్, ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ మాజీ ఎండీ శైలేంద్ర భండారి

పెట్టుబడి పెట్టాను.. అంతలేదు

ఓ మదుపరి, గ్రో యాప్ మధ్య వివాదం

ముంబై, జూన్ 29: తాను పెట్టుబడి పెట్టానంటూ ఓ మదుపరి.. అంతలేదని గ్రో యాప్ పరస్పర వాగ్వాదానికి దిగుతున్నాయి. యాప్ ద్వారా తాను ఓ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకంలో పెట్టుబడి పెట్టినట్టు కనిపిస్తున్నదని, కానీ దాన్ని తిరిగి ఉపసంహరించుకోలేకపోతున్నానని సదరు ఇన్వెస్టర్ చెప్తుండగా.. అసలు అంతలా ఎంఎఫ్ లావాదేవీనే జరుగలేదని గ్రో యాప్ కొట్టిపారేస్తున్నది.

మదుపరి చెప్తున్నదిది..

2020లో గ్రో యాప్ ద్వారా పరాగ్ పరీఖ్ మ్యూచువల్ ఫండ్ స్కీంలో తన సోదరి పెట్టుబడి మొదలుపెట్టిందని హనేంద్ర ప్రతాప్ సింగ్ ఓ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. లావాదేవీ విజయవంతమైనట్టు ఓ ఫోలియో నంబర్ కూడా వచ్చిందని తెలిపారు. గ్రో యాప్ కూడా ఇప్పటిదాకా పెట్టుబడి మొత్తాన్ని చూపించిందని, ఇతర ఫండ్స్ మాదిరిగానే అన్ని వివరాలను అందించిందని తెలియజేశారు. అయితే తమ పెట్టుబడిని ఆశించిన స్థాయిలో తిరిగి తీసుకుందామంటే కుదరట్లేదని వాపోయారు. దీనికి కారణం ఏంటని గ్రో కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఫలితం లేకపోయిందని సింగ్ అంటున్నారు.

గ్రో యాప్ వైపు నుంచి..

ఈ వివాదంపై గ్రో యాప్ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇక్కడ ఎలాంటి మోసానికి తావులేదన్నది. సదరు కస్టమర్ దగ్గర్నుంచి పేర్కొంటున్న మొత్తంలో నగదు అందలేదని, రీక్యాన్సిలేషన్ సమస్య వల్ల ఇన్‌కరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అని చూపుతున్నదని వెల్లడించింది. గ్రో యాప్ వివరాల ప్రకారం.. తొలుత 2020 సెప్టెంబర్ 25న రూ.10,000 పెట్టుబడి సదరు మదుపరి పెట్టారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ఐఎస్ఐపీ వేదికతో నేరుగా లింకైన ఓ బ్యాంక్ ద్వారా ఈ లావాదేవీ జరిగింది. దీని ఆర్డర్ ఐడీ 1XXXXXXX6. 2022 జూన్ 27న మరో ఫోలియో నుంచి రూ.50,000 లావాదేవీ జరిగింది. కానీ ఐడీ మాత్రం ఇదే (1XXXXXXX6). ఈ క్రమంలోనే తమ సిస్టమ్‌లో ఐడీ 1XXXXXXX6పై రూ.10వేల పెట్టుబడికి బదులు తర్వాత వచ్చిన రూ.50వేల పెట్టుబడే కనిపిస్తున్నదని గ్రో యాప్ పేర్కొన్నది. కానీ ఆ మొత్తం తమకు ఇప్పటికీ అందలేదని చెప్పింది. కాబట్టి మోసపోయామని ఆరోపిస్తున్న కస్టమర్ అసలు పెట్టుబడి రూ.10వేలేనని గ్రో యాప్ చెప్తున్నది. బీఎస్ఈ నుంచి కూడా తమకు ఇదే ధ్రువీకరణ వచ్చిందన్నది.

విద్యా రుణాల్లో ఎగవేతలెక్కువే

గృహ రుణాల్లో తక్కువ • ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 29: వ్యక్తిగత రుణాల విభాగంలో విద్యా రుణాల్లోనే ఎక్కువగా ఎగవేతలున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ తాజా నివేదికలో వెల్లడించింది. గృహ రుణాల్లో డిఫాల్టర్లు తక్కువగా ఉన్నట్టు చెప్పింది. పర్సనల్ లోన్లలో నిరర్థక ఆస్తులు (మొండి బకాయిలు లేదా ఎన్‌పీఏ) అత్యధికంగా ఎడ్యుకేషన్ లోన్లే ఉన్నాయని ఈ ఏడాది జూన్‌కుగాను ఆర్బీఐ విడుదల చేసిన ఆర్థిక సుస్థిరత నివేదిక (ఎఫ్ఎస్ఆర్)లో తేలింది. ఆ తర్వాతి స్థానాల్లో క్రెడిట్ కార్డు రుణాలు, వాహన రుణాలుండగా.. చివరి స్థానంలో గృహ రుణాలున్నట్టు స్పష్టమైంది.

విదేశీ చదువులతో..

విదేశీ చదువుల కోసం విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారని, అందుకే ఇటీవలికాలంలో విద్యా రుణాలు బాగా పెరిగిపోయాయని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత రుణాల మొండి బకాయిల్లో విద్యా రుణాల వాటా 3.6 శాతానికి చేరిందంటున్నారు. అయితే అన్ని పర్సనల్ లోన్ విభాగాల్లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల ఆస్తుల నాణ్యతలో విస్తృత శ్రేణిలో పెరుగుదల కనిపిస్తున్నట్టు ఆర్బీఐ తాజా నివేదిక పేర్కొన్నది. ఈ క్రమంలోనే అన్ని బ్యాంక్ గ్రూపుల వ్యాప్తంగా వ్యక్తిగత రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తుల క్షీణత కనిపిస్తున్నదని ఎఫ్ఎస్ఆర్‌లో సెంట్రల్ బ్యాంక్ తెలియజేసింది. ఇక పారిశ్రామిక రంగం పరిధిలో వెహికిల్స్, ట్రాన్స్‌పోర్ట్ ఎక్విప్‌మెంట్ విభాగాలు తప్ప అన్ని ప్రధాన ఉప రంగాల్లో అసెట్ క్వాలిటీ మెరుగుపడినట్టు కూడా పేర్కొన్నది.

హోం లోన్లకు గిరాకీ

పర్సనల్ లోన్లలో గృహ రుణాలకు ఈ ఏడాది మార్చిలో గిరాకీ 36.5 శాతం పెరిగిందని ఆర్బీఐ చెప్పింది. 25.2 శాతంతో తర్వాతి స్థానంలో క్రెడిట్ కార్డులున్నాయి. 20.5 శాతంతో విద్యా రుణాలు 3వ స్థానంలో, 19.9 శాతంతో ఇతర వ్యక్తిగత రుణాలు 4వ స్థానంలో ఉన్నాయి. వాహన రుణాలకు 18.3 శాతం డిమాండ్ కనిపించింది. కాగా, ప్రైవేట్ రంగ బ్యాంకుల రుణాల వృద్ధిలో సగానికిపైగా వ్యక్తిగత రుణాలే ఉండటం గమనార్హం. ఇదిలావుంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో క్రెడిట్ కార్డు రుణ బకాయిలు 23 శాతంగా ఉన్నాయి. అయితే నిరుడు ఇవి 31 శాతంగా ఉన్నాయి. ఈ ఏప్రిల్‌లో రిటైల్ రుణాల్లో వృద్ధి 17.1 శాతంగా ఉన్నది. నిరుడు 25.7 శాతం.

ఆర్బీఐ హెచ్చరికలు

భారీగా పెరుగుతున్న వ్యక్తిగత, అన్‌సెక్యూర్డ్ రుణాలపై బ్యాంకింగ్, ఇతర రుణదాతలను ఆర్బీఐ హెచ్చరిస్తూనే ఉన్నది. ఈ క్రమంలోనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అంతర్గత నిఘా వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు.

సోలార్ పథకంతో ఔత్సాహికుల ఇక్కట్లు

పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు

మాట్లాడుతున్న తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ పథకం క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని, దరఖాస్తు చేసుకోవాలనుకునే ఔత్సాహికులకు పోర్టల్ చుక్కలు చూపెడుతున్నదని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు బీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు వేలాది మంది ఆసక్తి చూపుతున్నా..పథకంలో పొందుపరిచిన నిబంధనల కారణంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా నాలుగు నెలలు గడిచినప్పటికీ అధికారిక పోర్టల్లో సాంకేతిక లోపాల కారణంగా దరఖాస్తుల స్వీకరణ విధానం పనిచేయకపోవడంతో ఔత్సాహికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద అపార్టుమెంట్లు, సొసైటీలు ఏర్పాటు చేసుకునేందుకు పోర్టల్ అనుమతించడం లేదని పలువురు ఔత్సాహికులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సులభతరమైన విధానాన్ని కేంద్రం అమలు చేయాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది. దీనిపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక నిరాహార దీక్ష చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సీబీడీటీ చీఫ్‌గా రవి అగర్వాల్

న్యూఢిల్లీ, జూన్ 29: ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) నూతన చైర్మన్‌గా రవి అగర్వాల్ నియమితులయ్యారు. 1988 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి రవి.. ప్రస్తుతం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నితిన్ గుప్తా స్థానాన్ని భర్తీ చేయనున్నారు. సీబీడీటీ చీఫ్‌గా జూన్, 2022లో నియమితులైన గుప్తా గతేడాది సెప్టెంబర్‌లోనే పదవీ విరమణ కావాల్సి ఉండగా, పదవీ కాలాన్ని తొమ్మిది నెలలు పొడిగించింది. దీంతో ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు.

టికెట్లపై ఆకాశ ఎయిర్ ఆఫర్

న్యూఢిల్లీ, జూన్ 29: చౌక విమాన యాన సంస్థ ఆకాశ ఎయిర్.. దేశీయంగా నడిచే విమాన టికెట్లపై 20 శాతం వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. 'సేవర్' అండ్ 'ఫ్లెక్సీ' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ దేశీయంగా నడుస్తున్న 22 రూట్లకు వర్తించనున్నది. ఈ ఆఫర్ జూలై 1 వరకు అందుబాటులో ఉండనున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూలై 5 నుంచి సెప్టెంబర్ 30 లోగా ప్రయాణించాల్సి ఉంటుందని తెలిపింది.

జూలైలో కెమెరా ముందుకు?

ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ చేతిలో ప్రస్తుతం మూడు సినిమాలున్నాయి. అందులో ఒకటి 'హరిహరవీరమల్లు' కాగా, రెండోది 'ఓజీ', మూడోది 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ మూడు సినిమాలు పూర్తి చేయాల్సి బాధ్యత ప్రస్తుతం పవన్‌పై ఉంది. జూలై నుంచి పవన్ షూటింగుల్లో పాల్గొంటారని ఫిల్మ్‌వర్గాల టాక్. ముఖ్యంగా క్రిష్ డైరెక్షన్‌లో మొదలైన 'హరిహరవీరమల్లు' సినిమా 70శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఆ మిగిలిన పార్ట్‌ని ఏ.ఎం.రత్నం తనయుడు జ్యోతికృష్ణ పూర్తిచేయనున్నాడు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలోని తొలి పార్ట్‌ని ఎట్టిపరిస్థితుల్లో ఈ ఏడాదే విడుదల చేయాలనే గట్టి తలంపుతో ఉన్నారు నిర్మాత ఏ.ఎం.రత్నం. పవన్ షూటింగులు మొదలుపెడితే.. ముందు పూర్తి చేయాల్సిన సినిమా ఇదే కావడం గమనార్హం. ఈ సినిమా గురించి ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ ' ప్రస్తుతం సీజీ వర్క్ జరుగుతున్నది. ఈ సినిమాలో గ్రాఫిక్స్ అద్భుతంగా ఉంటాయి. ఇరాక్‌కి చెందిన ప్రముఖ కంపెనీతో మచిలీపట్నం ఓడరేవు సన్నివేశాలకు సీజీ వర్క్ చేయిస్తున్నాం. ఇందులో కుస్తీ పోటీల ఎపిసోడ్ ఉంది. దానికి సంబంధించిన సీజీవర్క్ బెంగళూర్‌లో జరుగుతున్నది. అలాగే.. చార్మినార్ ఎపిసోడ్ సీజీ వర్క్, పులితో పవన్‌కల్యాణ్ పోరాట సన్నివేశానికి సంబంధించిన సీజీ వర్క్ ఇవన్నీ జరుగుతున్నాయి' అని తెలిపారు. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్‌కల్యాణ్ సినిమాలు చేస్తాడా? చేయడా? అనే ప్రశ్నలతో సతమతమవుతున్న అభిమానులకు ఏ.ఎం.రత్నం ఓ విధంగా శుభవార్తే చెప్పారు.

'కల్కి'తో దీపికా రికార్డు

చిత్రం

ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'కల్కి' చిత్రం వెండితెరపై ఓ సరికొత్త ప్రపంచాన్ని సాక్షాత్కరింపజేస్తూ విజువల్ వండర్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల మన్ననలు అందుకుంటున్నది. తొలి రెండు రోజుల్లో 298కోట్ల కలెక్షన్స్ సాధించి లాంగ్‌రన్‌లో వెయ్యికోట్ల మార్క్‌ను దాటొచ్చనే నమ్మకాన్ని కలిగిస్తున్నది. ఈ సినిమాలో సుమతి పాత్రలో దీపికా పడుకోన్ అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. 'కల్కి' చిత్రం ద్వారా దీపికా పడుకోన్ ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. దీపికా సినీ కెరీర్‌లోనే హయ్యెస్ట్ ఓపెనింగ్ డే కలెక్షన్లు సాధించిన చిత్రంగా 'కల్కి' నిలిచింది. ఇప్పటివరకు హిందీలో యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ చిత్రాలతో పాటు రోహిత్‌శెట్టి కాప్ యూనివర్స్ వంటి భారీ చిత్రాల్లో భాగమైంది దీపికా పడుకోన్. అయితే ఈ చిత్రాలను అధిగమిస్తూ తొలి రోజు అత్యధిక వసూళ్లతో 'కల్కి' రికార్డు సృష్టించింది. గత ఏడాది దీపికా పడుకోన్ నటించిన 'పఠాన్' చిత్రం తొలి రోజు 106కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. తాజాగా 'కల్కి' తొలి రోజు 191 కోట్ల వసూళ్లతో రికార్డు క్రియేట్ చేసింది. తన కెరీర్‌లోనే ఫస్ట్‌డే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా 'కల్కి' దీపికా పడుకోన్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోనుంది. ఇదిలావుండగా భారతీయ సినిమాల్లో ఆర్ఆర్ఆర్ (223 కోట్లు), బాహుబలి-2 (231 కోట్లు) చిత్రాలు తొలి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలుగా నిలవగా, ఇప్పుడు మూడోస్థానంలో 'కల్కి' ఉండటం విశేషం.

అభిప్రాయాలను అడిగి తప్పచేశాను

'సినిమాటిక్ యూనివర్స్' ఇప్పుడు ప్రపంచ సినిమాలో ఇదో ట్రెండ్. సీక్వెల్‌కి ఇది అప్‌డేట్ ట్రెండ్ అని చెప్పొచ్చు. సీక్వెల్ అంటే కథను కొనసాగించడం. 'సినిమాటిక్ యూనివర్స్' అంటే ఒక సినిమాలోని పాత్రలనో, లేక ఆ సినిమా ప్రపంచాన్నో మరో సినిమాలో కొనసాగించడం. హాలీవుడ్ సెన్సేషన్ 'అవెంజర్స్' నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుందని చెప్పొచ్చు. తమిళంలో వచ్చిన ఖైదీ, విక్రమ్ సినిమాలు ఈ కోవకు చెందిన చిత్రాలే. అయితే.. ఈ ఆలోచన దర్శకుడు శంకర్‌కి 2008లోనే వచ్చిందట. కానీ కార్యరూపం దాల్చలేదు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా తెలిపారు. ' 'రోబో' టైమ్‌లో ఓ ఆలోచన వచ్చింది. భారతీయుడు, ఒకేఒక్కడు, శివాజీ.. ఈ మూడు సినిమాల్లోని హీరో పాత్రల్ని కలుపుతూ ఒక సినిమా చేస్తే ఎలా ఉంటుంది? అనేది నా ఆలోచన. వెంటనే నా అసిస్టెంట్లకు ఈ ఆలోచన చెప్పాను. వాళ్లు సమాధానం ఇవ్వకపోగా నవ్వారు. వాళ్లకు ఈ ఆలోచన నచ్చలేదని అర్థమైంది. కానీ నాకెందుకో ఇది వర్కవుట్ అవుతుందని పించింది. అందుకే ఇంటికెళ్లి నా భార్య, పిల్లలకు చెప్పాను. వాళ్లనుంచి సరైన స్పందనే లేదు. స్నేహితులతో చెప్పాను. వెటకారంగా నవ్వారు. నా ఆలోచనే కరెక్ట్ కాదని పదిలేశా. కొన్నాళ్లకు హాలీవుడ్‌లో 'అవెంజర్స్' వచ్చింది. మూవీ చూశాక, 'మీకేదైనా కొత్త ఆలోచన వస్తే త్వరగా తీసేయ్యండి. లేకపోతే ఈ ప్రపంచంలో ఎవరో ఒకరు తీసేస్తారు..' అని నా అసిస్టెంట్లకు చెప్పాను. ఆ రోజు ఎవరి అభిప్రాయాలూ ఆడక్కుండా నేను ఆ ప్రయోగం చేసుంటే.. ఇండియాలో 'సినిమాటిక్ యూనివర్స్' తీసుకొచ్చిన తొలి దర్శకుడిని అయ్యేవాడ్ని' అంటూ గతాన్ని నెమరువేసుకున్నారు శంకర్.

దసరా బరిలో కంగువ

తమిళ అగ్రనటుడు సూర్య నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కంగువ'. దిశాపటానీ ఇందులో కథానాయిక. శివ ఈ చిత్రానికి దర్శకుడు. కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ కలిసి అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. 'భారతీయ సినీ పరిశ్రమ నుంచి వస్తున్న మరో బిగ్గెస్ట్ మూవీ ఇది. ఇప్పటిదాకా తెరపై రాని కొత్త కాన్సెప్ట్‌తో దర్శకుడు శివ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పది భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పలు అంతర్జాతీయ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. 'కంగువ' త్రీడీ వెర్షన్ కూడా ఉంటుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. సినిమా అంతకు మించి ఉంటుంది' అని తెలిపారు నిర్మాతల్లో ఒకరైన జ్ఞానవేల్‌రాజా. బాబీ డియోల్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కథ: శివ, ఆదినారాయణ, మాటలు: మదన్ కార్కే, కెమెరా: వెట్రి పళనిస్వామి.

అవి తెలియక చేసిన తప్పులు

ఓ వైపు సినిమాలు చేస్తూ, మరో వైపు ప్రజలకు ఆరోగ్యానికి సంబంధించిన టిప్స్ ఇస్తున్నది అగ్ర కథానాయిక సమంత. తన ఫిట్‌నెస్ ట్రైనర్ అల్కేష్ షరోత్రితో కలిసి 'టేక్ 20' పేరుతో ఇన్‌స్టా వేదికగా ఆరోగ్య సూత్రాలను వల్లెవేస్తున్నది ఈ అందాలభామ. ఇందులో భాగంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా ప్రమోట్ చేస్తున్నది. ఇదిలావుంటే.. సమంత టిప్స్‌పై ఓ నెటిజన్ క్వశ్చన్ చేశాడు. 'ఇప్పుడీ సూక్తులు చెబుతున్నారు బాగానే వుంది. గతంలో మీరు అనారోగ్యమైన బ్రాండ్లను ప్రమోట్ చేశారు. దానికేం సమాధానం చెబుతారు?' అని అడిగాడు. దాంతో కంగుతినడం సామ్ వంతైంది. వెంటనే తను రియాక్ట్ అవుతూ 'గతంలో తప్పులు చేసిన మాట నిజమే. అవి తెలియక చేసిన తప్పులు. తెలుసుకున్న తర్వాత అలాంటి వాటిని ప్రమోట్ చేయడం పూర్తిగా ఆపేశాను. ప్రస్తుతం ఏవైతే ఆచరిస్తున్నానో.. వాటిని మాత్రమే చెబుతున్నాను' అని తెలిపారు. ప్రస్తుతం తన సొంత నిర్మాణ సంస్థలో 'మా బంగారం' అనే సినిమాను రూపొందిస్తున్నది సమంత.

'కూర్మనాయకి'లో శివాజీ

వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, అతిరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కె.విజితారావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శివాజీ ఓ కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. శనివారం ఆయన జన్మదినం సందర్భంగా ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. మహావిష్ణువు అవతారాల్లోని కూర్మావతారం నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, అత్యున్నత సాంకేతి విలువలతో అలరిస్తుందని, ఈ సినిమాలో శివాజీ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో నటించబోయే ఓ స్టార్ హీరో వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర, రచన-దర్శకత్వం: హర్షవర్ధన్ కడియాల.